క్లుప్తంగా

బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతి నిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ శ్యామల అన్నారు. శనివారం మండలంలోని అరూరు దళితవాడ అంగన్ వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాల పరిశుభ్రత, ఆహార శుభ్రత చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు మెగా వైద్య శిబిరం

నింద్ర: మండలంలోని మేళంబాకం గ్రామంలో ఆదివారం అడాప్ట్ ఎ విలేజ్ గ్లోబల్ ఫౌండేషన్‌వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు సభ్యులు తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు డాక్టర్లు ఉచితంగా వైద్య పరీక్షల నిర్వహిస్తారని తెలిపారు. గుండె, కన్ను, ఎముకలు, చిన్న పిల్లలకు, ప్రసూతి, క్యాన్సర్, నరాల సంబంధిత వైద్య నిపుణులు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

గుంతల దారి.. తప్పని అవస్థలు



గుంతల మయంగా అగ్రహారం - తమిళనాడు పొన్నై రోడ్డు

గంగాధరనెల్లూరు: మండలంలోని కొత్త వెంకటాపురం పంచాయతీలోని అగ్రహారం గ్రామం నుండి కొత్త వెంకటాపురం ఆదిఆంధ్రవాడ వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో పాటు కంకర తేలిపోయింది. ఈ దారిలో ద్విచక్ర వాహనాలు, పాల వ్యాన్‌లు, కార్లుతో పాటు చిత్తూరు–కొత్త వెంకటాపురం ఆర్టీసీ బస్సు సర్వీసులకు తిప్పలు తప్పడంలేదు. తరచూ టైర్లు పంక్చర్ కావడం తదితర ఘటనలతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. అయితే సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికు విమర్శిస్తున్నారు. ఈ గుంతల రోడ్డును బాగు చేయాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

నేడు పాతగుంటలో జల్లికట్టు

వెదురుకుప్పం: మండలంలోని పాతగుంటలో ఆదివారం జల్లికట్టు(ఎద్ల పందాలు) నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నారు. పరుష పోటీల్లో పెద్ద ఎత్తున కోడెగిత్తలు పందెంలో పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు.

కౌంటర్లల్లో... ధరల పట్టిక



బ్యాగుల కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన ధరల పట్టిక

సాక్షి ఎఫెక్ట్..

కాణిపాకం: కాణిపాకంలోని పలు కౌంటర్లల్లో ఆ కౌంటర్ నిర్వాహకులు ధరల పట్టికలు పెట్టారు. సాక్షి దినపత్రికలో 'అధికారమే పెట్టుబడి..దోపిడీనే రాబడి' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఈఓ పెంచల కిషోర్ ఆగ్రహానికి గురయ్యారు. కౌంటర్‌లను తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. మరో మారు వారిని కార్యాలయానికి పిలిచి బోర్డులు ఏర్పాటు చేయాలని గట్టిగా వార్నింగ్ ఇచ్చారు. దీంతో ఏయే దానికి ఎంతెంత వసూలు చేయాలో ధరల పట్టికలు ఏర్పాటయ్యాయి. అదనపు వసూళ్లకు బ్రేకులు పడ్డాయి.

ఉద్యోగమేళాలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

చిత్తూరు కలెక్టరేట్: బెంగళూరుకు చెందిన బహుళజాతి కంపెనీ నిర్వహించిన జాబ్ మేళాలో తమ కళాశాల విద్యార్థులు ప్రతిభ చాటి ఉద్యోగాలు సాధించారని ఆర్‌కే డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ బద్రినారాయణ, ప్రిన్సిపల్ రమేష్‌బాబు తెలిపారు. శనివారం మిట్టూరులోని కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో విద్యార్థులను అభినందించారు. వారు మాట్లాడుతూ రూ.4లక్షల నుంచి రూ.6లక్షల వార్షిక వేతనంతో 16 మంది విద్యార్థులు ఎంపికైనట్లు వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఆర్‌లు హేమంత్, జితిన్, గ్రూపు ప్రతినిధులు సుస్మిత, జ్యోతిప్రసాద్ పాల్గొన్నారు.

అధునాతన వ్యవసాయం

గ్రామీణ ప్రాంత రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులవైపు అడుగులు వేస్తున్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలుకుతూ అధునాతన సాంకేతికతను వ్యవసాయంలో ఉపయోగించుకుంటున్నారు. సేద్యంలో కొత్త ఒరవడితో అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు. సాగు చేసిన పంటలకు తెగుళ్లు సోకినట్లయితే డ్రోన్ ద్వారా మందుల పిచికారీ చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

–విజయపురం



వడమాలపేటలో డ్రోన్‌పై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ, (ఇన్‌సెట్) విజయపురంలో డ్రోన్ సాయంతో మందుల పిచికారీ

- మందుల పిచికారీకి డ్రోన్ సాంకేతికత
- సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా
- అన్ని రకాల పంటలకు అనుకూలం
- పల్లెల్లో ఆసక్తి చూపుతున్న రైతులు

సరికొత్త సాంకేతికతతో వస్తున్న డ్రోన్‌లతో సకాలంలో సత్వరమే మందులను పిచికారీ చేసేందుకు వీలుంది. పంటల సాగులో పెట్టు బడులు పెరిగిపోయి దిగుబడులు తగ్గడంతో రైతులకు వ్యవసాయంలో నష్టాలు వస్తున్నాయి. నష్టాలను అధిగమించి ఆదాయం ఆర్జించేందుకు రైతులు నూతన యంత్రాలను ఉపయోగించుకుంటున్నారు.

వేధిస్తున్న కూలీల కొరత

పంటలు సాగు చేశాక వాటి సంరక్షణ ఎంతో కీలకం. పంటలు సాగు చేసిన 20 రోజుల నుంచే పురుగు మందులను పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే మందులు పిచికారీ చేసేందుకు కూలీలు దొరకడం లేదు. దీంతో సకాలంలో మందులు పిచికారీ చేయకపోతే సాగులో నష్టాలను చవి చూడాల్సి వస్తోంది. అంతేకాక కూలీలతో మందులను పిచికారీ చేయడం ఖర్చుతో కూడుకున్న పనిగా మారింది. దీంతో సాగులో పెట్టుబడులు పెరిగి దిగుబడులు అందక రైతులు నష్టపోతున్నారు.

ఖర్చుతోపాటు సమయం ఆదా

పంటల సాగులో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించడం ద్వారా సాగులో ఖర్చుతోపాటు సమయం ఆదా అవుతోంది. దీని ద్వారా అనుకున్న సమయానికి పంటలకు మందులను పిచికారీ చేయవచ్చు. ఇందుకు ఎకరాకు కేవలం రూ.500 తీసుకుంటున్నారు. అదే కూలీతో మందు పిచికారీ చేసేందుకు ఎకరాకు ముగ్గురు కూలీలకు రూ.1500 ఖర్చు, ఎక్కువ సమయం అవుతోంది. దీంతో గ్రామీణ ప్రాంత రైతులు డ్రోన్ ద్వారా పిచికారీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

నగరి నియోజకవర్గంలో రబీ సీజన్‌లో వరి, వేరుశనగ, ఉద్దులు, పెసలు తదితర పంటలు దాదాపు 5వేల హెక్టార్లల్లో రైతులు సాగు చేస్తున్నారు. కూలీల కొరత నేపథ్యంలో డ్రోన్ల రంగం ప్రవేశం రైతులకు ఎంతో ప్రయోజనకరంగా మారింది. వరి, వేరుశనగ, ఉద్దులు, పెసలు, మామిడి తదితర పంటలకు రసాయన మందులను పిచికారీ చేసుకోవడానికి డ్రోన్లు ఉపయోగించి ఖర్చును తగ్గించుకుటున్నారు. 5 ఎకరాల పంటకు మందులు పిచికారీ చేయాలంటే రూ.1500 ఖర్చు అవుతుంది. అలాగే వేల లీటర్ల నీటితోపాటు సుమారు 6 గంటల సమయం పడుతుంది. అదే డ్రోన్ సాయంతో మందులు పిచికారీ చేస్తే గంటలోపు పని ముగించుకొని ఇంటికి వెళ్లవచ్చు.

కష్టం లేదు

నేను 5 ఎకరాలు వరి సాగు చేశాను. మందులు పిచికారీ చేయడానికి కూలీలు దొరక్క చాలా కష్టపడ్డాను. అధికారుల సూచన మేరకు డ్రోన్ సాయంతో గంటలోపు 5 ఎకరాలకు మందులు పిచికారీ చేశాను. ఎంతో ప్రయోజనకరంగా ఉంది. –రాఘవయ్య, రైతు, పన్నూరు

రైతులకు సబ్సిడీ డ్రోన్



డ్రోన్ రైతులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. వరి, వేరుశనగ, ఉద్దులు, మామిడి తదితర పంటలకు మనుషులతో మందులు పిచికారీ చేయడం చాలా కష్టం. డ్రోన్ ద్వారా ఈజీగా, తక్కువ ఖర్చుతో మందులు కొట్టవచ్చు. సమయం, డబ్బుతోపాటు నీరు కూడా ఆదా అవుతుంది. ఐదుగురు రైతులు గ్రూపుగా ఏర్పడి అర్జీ పెట్టుకుంటే డ్రోన్ అందిస్తాం.

–విజయకుమార్, ఏఓ, వడమాలపేట

దుస్థితిలో చేతి పంపు



ఏఎంపురంలో చేతిపంపు చుట్టూ పిచ్చిమొక్కలు

వడమాలపేట(విజయపురం): రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేస్తున్నా పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. వడమాలపేట మండలంలో మొత్తం 22 పంచాయతీలు ఉండగా అందులో చాలా వరకు చేతిపంపులు మరమ్మతులకు గురై పని చేయడం లేదు. వాటిని సరి చేయాల్సిన పంచాయతీ కార్యదర్శులు పట్టించుకోవడం లేదు. దీంతో చేతిపంపుల చుట్టూ పిచ్చిమొక్కలు దర్శనమిస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులు దృష్టి పెట్టి మరమ్మతులకు గురైన చేతిపంపులను సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

బీజేపీ నేతల సంబరాలు

నగరి: ఢిల్లీలో భారతీయ జనతా పార్టీ విజయం సాధించడంపై ఆ పార్టీ నేతలు శనివారం సాయంత్రం టవర్‌క్లాక్ సెంటర్‌లో బాణాసంచా పేల్చి, స్వీట్లు పంచుకొని సంబరాలు చేసుకున్నారు. ప్రధానమంత్రి పరిపాలనా దక్షతే విజయానికి కారణమని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌నాయుడు, జిల్లా నాయకులు రామ్మూర్తియాదవ్, వేలాయుధం, మోహన్, మండల అధ్యక్షుడు హరి, రూరల్ అధ్యక్షుడు సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహానేత వైఎస్ఆర్‌కు ఘన నివాళి



నెల్లేపల్లిలో వైఎస్ఆర్ విగ్రహానికి నివాళ

గంగాధరనెల్లూరు: నెల్లేపల్లి గ్రామంలోని మహానేత వైఎస్ఆర్ విగ్రహానికి నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు కామసాని కిషోర్‌కుమార్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జీడీనెల్లూరు యువజన విభాగం నూతన అధ్యక్షుడిగా నియమితులు కావడంతో కిషోర్‌కుమార్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారు. వైఎస్ఆర్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి, నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. వంశీకృష్ణ, జగదీష్, మనోజ్, చాణక్య, వైఎస్ఆర్ సీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

గుడిపాల: ఇంటి వద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నామని పీహెచ్‌సీ డాక్టర్ సంధ్య తెలిపారు. శనివారం రామభద్రాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మంచాన పడిన రోగుల నివాసాలకే వెళ్లి వైద్యం చేస్తున్నామని వెల్లడించారు. అనంతరం బీపీ, షుగర్, గర్భిణులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది విజయ, చంద్రశేఖర్, అనూరాధ, అనిత, ప్రవీణ్, శివగామి పాల్గొన్నారు.

70 మందికి వైద్య పరీక్షలు

ఐరాల: మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. శనివారం మండలంలోని పేయన్నగారిపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 70 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

ఆసుపత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమం



చారాలలో వైద్యం చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు ఆసుపత్రిలో ప్రసవించడం తల్లీబిడ్డకు క్షేమమని వైద్యులు డాక్టర్ ప్రియాంక, డాక్టర్ మోహన్‌వేలు పేర్కొన్నారు. శనివారం మండలంలోని చారాల, కారకాంపల్లెలో వేర్వేరుగా ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు ప్రతి నెలా పరీక్షలు చేయించుకోవాలని, రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుబ్రమణ్యం రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీహరివైద్య, సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నాయకులు

నగరి: నియోజకవర్గంలో భూ సమస్యలు, రోడ్డు సమస్యలు, ఇంటి స్థలాల సమస్యలు అనేకం ఉన్నాయని, వాటిని పరిష్కరించే విధంగా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక పేరిట వినతులు స్వీకరించడానికి శనివారం ఎమ్మెల్యే ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. విజయపురం మండలంలోని కేవీ పురం గ్రామంలో 85 మందికి జగనన్న పేరు పైన పట్టాలు ఇచ్చారని, వారికి ఇంటి స్థలాలు చూపాలని కోరారు. పాతార్కాడు అరుంధతివాడకు చెందిన వారికి ఇంటిపట్టాలు ఇవ్వాలన్నారు. శానిటేషన్ కార్మికులకు హౌసింగ్ కాలనీ ఏర్పాటు చేయాలని కోరారు. నగరి కుశస్థలి నది నుంచి ఇసుక అక్రమంగా విచ్చలవిడిగా తోడేస్తున్నారని, అక్రమ క్వారీలపై అధికారుల పర్యవేక్షణ ఉండేవిధంగా చూడాలని కోరారు. డైయింగ్ పరిశ్రమలను అరికట్టి రసాయన నీటి సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ సమస్యలపై దళిత్ పీపుల్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.గజేంద్రన్ ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. రసాయనాలను కాలువలో వదలి తాగు, సాగు నీటి కాలుష్యానికి పాల్పడుతున్న డైయింగ్, మిషన్ డైయింగ్‌లను మూసివేయాలంటూ వినతిపత్రం సమర్పించారు. ప్రాణహాని కలిగించే రసాయనాలు నీటిలో కలుస్తున్నందున వెనువెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వీలైనంత త్వరలో సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి వేలన్, నాయకులు రాజేంద్ర, బాషా, ఏఐటీయూసీ నాయకులు సతీష్, రమేష్, రాజేంద్ర, నాగరాజు పాల్గొన్నారు.

ఒడిశా నుంచి చెన్నైకు 10 కేజీల గంజాయి తరలింపు

- మహిళ సహా ఇద్దరి అరెస్టు



అరెస్టయిన స్వాతిక



శరవణన్

తిరుత్తణి: ఒడిశా నుంచి చెన్నైకు గంజాయి తరలించిన మహిళ సహా ఇద్దరిని పోలీసులు అరెస్టు చేసి 10 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వివరాలు.. తిరుత్తణి సమీపంలోని చెన్నై తిరుపతి జాతీయ రహదారి పొన్పాడి చెక్‌పోస్టులో శనివారం మద్యపాన నిషేధిత విభాగం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతి నుంచి చెన్నైకు వెళ్తున్న ప్రభుత్వ బస్సులో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సూట్ కేసులో తరలించిన 10 కేజీల గంజాయి గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. యువతీ, యువకుడిని అదుపులోకి తీసుకుని తిరుత్తణిలోని మద్యపాన నిషేధిత విభాగం పోలీసులకు అప్పగించారు. సీఐ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తులో ఒడిశాలోని భువనేశ్వర్‌కు చెందదిన స్వాతిక(21), చిత్తూరు జిల్లా కార్వేటినగరానికి చెందిన శరవణన్(24)గా తెలిసింది. వారిద్దరిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచి జైలుకు తరలించారు.

ఇంటి స్థలాల పంపిణీకి డిమాండ్

చిత్తూరు కార్పొరేషన్: కూటమి నేతలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇంటి స్థలాలను వెంటనే పంపిణీ చేయాలని సీపీఐ నేతలు డిమాండ్ చేశారు. శనివారం ఈ మేరకు నగరంలోని లెనిన్‌నగర్, హౌసింగ్‌కాలనీ, మంగసముద్రంహౌసింగ్‌కాలనీలో పర్యటించి అర్హులతో అర్జీలు రాయించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ వినతి పత్రాలను సోమవారం మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్‌కు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నేతలు గోపీనాథ్, మణి, రమాదేవి, విజయ్‌కుమార్, విజయగౌరీ, కుమారి, కవిత, లతారెడ్డి, రఘు, చాంద్‌బాషా, కార్తీక్ పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు



దాసరిగుంట వీధిలో ట్రాన్స్‌ఫార్మర్



కొత్తవీధిలో...



ఎల్ఐసీ కార్యాలయం వద్ద..



వీవర్స్ కాలనీలో..

- గేట్‌పుత్తూరులో నాలుగు
- పుత్తూరు పట్టణంలో రెండు ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..

పుత్తూరు: పట్టణంలో శనివారం పలుచోట్ల కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను స్థానిక ఏపీ ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. పట్టణంలో పలు చోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయని గత డిసెంబర్ 12వ తేదీన సాక్షి దినపత్రికలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. గేట్‌పుత్తూరులోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల సమీపంలో ఉన్న పలు ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయని, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటూ కథనంలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఏపీ ట్రాన్స్‌కో అధికారులు దుస్థితికి చేరి, పిల్లలకు అందే విధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేశారు. పిల్లలకు అందకుండా సిమెంట్ పిల్లర్ల ఎత్తును పెంచారు. గేట్‌పుత్తూరులోని దాసరిగుంట వీధి, వీవర్స్ కాలనీ, కొత్తవీధి, ఒత్తవాడ వీధుల్లో కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయడంతోపాటు పట్టణంలోని కాపువీధి, తిరుపతి రోడ్డులోని ఎల్ఐసీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేశారు. దీంతో స్థానిక ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పిల్లలకు అందకుండా జాగ్రత్తలు

పట్టణంలో సిమెంట్ రోడ్లు వేయడం ద్వారా రోడ్డు ఎత్తు పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు పిల్లలకు అందేవిధంగా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో అలాంటి చోట్ల పిల్లలకు అందకుండా ఎత్తు పెంచి ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం. అన్నిచోట్ల 100 కేవీ డీటీఆర్‌లను ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతానికి ఆరు చోట్ల ఏర్పాటు చేశాం. ఎక్కడెక్కడ లోలెవల్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయో గుర్తించి అక్కడ కూడా ఎత్తు పెంచుతాం.

–సాయి, ట్రాన్స్‌కో ఏఈ, పుత్తూరు

వాతావరణంలో మార్పులు



మంచుతో ఉదయం

నగరి: వాతావరణంలో వినూత్న మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఉదయం మంచు అధికంగా కురుస్తోంది. 8 గంటల వరకు కూడా మంచు తెరలు వీడడం లేదు. స్వెట్టర్లు, మంకీ క్యాప్‌లు లేకుండా బయటకు రాలేని పరిస్థితి నెలకొంటోంది. వాహనాల్లో వెళ్లే వారికి రోడ్డుపై లైటు వేయందే ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. అయితే మధ్యాహ్నం వాతావరణ పరిస్థితులు ఇందుకు భిన్నంగా ఉంటున్నాయి. అకస్మాత్తుగా సూర్యుడు తన ప్రతాపం చూపుతున్నాడు. వాతావరణం వేడిగా ఉంటోంది.



ఎండతో మధ్యాహ్నం

వందేళ్ల చెట్టు ఒరిగింది

- వందేళ్ల చింతచెట్టు నరికివేత
- పట్టించుకోని రెవెన్యూ యంత్రాగం

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండల పరిషత్ కార్యాలయం నుంచి బస్టాండు వరకు రోడ్డుకి ఇరువైపులా పెద్ద పెద్ద చెట్లు ఉన్నాయి. ఒక్కొక్క చెట్టు వయస్సు వందేళ్లకు పైగానే ఉంటాయి. శనివారం వడమాలపేట మెయిన్ రోడ్డు ఆంజనేయస్వామి గుడికి ఎదురుగా ఉన్న చింతచెట్టును విద్యుత్‌శాఖ పేరిట కొందరు ప్రైవేటు వ్యక్తులు అనుమతులు లేకుండా నరికివేశారు. నరికిన చెట్టును అధికారులకు అప్పగించకుండా ప్రైవేటుగా తరలించేశారు. పంచాయతీ, రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ అనుమతులు లేకుండా నరికి వాల్టా చట్టానికి తూట్లు పొడుస్తున్నారు. వందేళ్ల చింతచెట్టును నరికివేయడంతో స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికే వడమాలపేట గ్రామీణ ప్రాంతాల్లో కొందరు కలప అక్రమ వ్యాపారులు చింతచెట్లను నరికేస్తుంటే అటు రెవెన్యూ, ఇటు అటవీ శాఖ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి.

రెండు రోజులు సెలవు కావడంతో..

శని, ఆదివారం రెండు రోజులు సెలవు కావడంతో అధికారులు ఎవ్వరూ లేరు. దీన్ని అనువుగా తీసుకొన్న ప్రైవేటు వ్యక్తులు విద్యుత్‌శాఖ పేరిట అక్రమంగా చింత చెట్లు నరికేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉన్న కొమ్మలను మాత్రమే తొలగించాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా పెద్ద పెద్ద యంత్రాలు వాడి చెట్లను నరికేస్తున్నారు.



వడమాలపేట మెయిన్ రోడ్డుపై నరికేసిన చింతచెట్టు

కొమ్మలను మాత్రమే తొలగించమన్నాం

విద్యుత్ అంతరాయానికి అడ్డుగా ఉన్న కొమ్మలను తొలగించడానికి అనుమతి కోరారు. చెట్టును నరకమని ఎక్కడా చెప్పలేదు. వెంటనే పరిశీలించి చర్యలు తీసుకొంటాం.

–జరీనా, తహశీల్దార్, వడమాలపేట